861) సామంతం / సునాదవినోదిని

ప॥ ఉన్నతోన్నతుడు వుడయవరు । యెన్న ననంతుడే యీ యుడయవరు ॥

చ॥ సర్వలోకముల శాస్త్రరహస్యము- । లుర్వి బోడమె నీ యుడయవరు ।
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు । నిర్వహించె నన్నిటా నుడయవరు ॥

చ॥ వెక్కసపు శ్రీవిష్ణుభక్తియే । వొక్కరూపమే వుడయవరు ।
చక్కనైన సుజ్ఞానమున కిరవై । వుక్కు మీఱెనిదె వుడయవరు ॥

చ॥ కదిసె మోక్షసాకారము దానై । వుదుటున నిలిచె నీ వుడయవరు ।
యిదిగో శ్రీవేంకటేశ్వరు నీడై । పొదలుచు నున్నాడు భువి నుడయవరు ॥